# మతకలహాల రోజుల్లో...

రచన:
అంబటిపూడి వెంకటనరసింహం

సీతారామయ్య తనకారులో ఆఫీసునుండి తిరిగివచ్చేస్తున్నాడు. పగలంతా ఆఫీసులో పనిచేసి విసుగ్గా ఉన్నందున విశ్రాంతిగా కారులోకూర్చొని వీధులవేపు చూస్తున్నాడు. వీధులన్నీ త్రివర్ణపతాకాలతోను, తోరణాలు వాటితోటి అలంకరింపబడి ఆగస్టు 15 వుత్సవ ఉత్సాహాలు జ్ఞాపకంచేస్తూ ఉన్నయి.

సీతారామయ్య ఆగస్టు 15 గురించి గాఢంగా ఆలోచిస్తున్నాడు. "నిజంగా ఆగస్టు 15 చరిత్రప్రసిద్ధమైనరోజు. యీరోజుననే ఇండియాకు స్వతంత్రం కల్గటం, కొత్త మహమ్మదీయరాజ్యం ఏర్పడటం జరిగేయి. నిస్సందేహంగా ఆ దినం ఒక మహత్తర కార్యాన్ని జయించింది. హిందువులందరు గర్వించతగ్గ రోజు. స్వతంత్ర దినోత్సవాలు దేశమంతా జరిగాయి. ముఖ్యంగా హిందూదేశపు మధ్య దక్షిణభాగాల్లో.

కాని, వివాదభరితమైన సంఘటనలు జరిగిన ఆరోజుకూడ మరచిపోలేం — మహాత్మ గాంధీ అవతరించిన పుణ్యభూమిలోనే పిరికి పందలు ఆయుధాలు తీసుకుని అమానుషంగాను, పశుప్రాయంగాను ప్రవర్తించారు."

కారు సీతారామయ్య బంగళా ముందాగింది. చాప్రాసీకి తన చేపెట్టె, హ్యాట్ అందించి లోనికి వెళ్లాడు. చావడిలోనుండి పోతూ అతని కొడుకు మణి కిటికీలోనుండి ఆటస్థలంవైపు తదేకధ్యానంగా చూస్తూ నిలబడివుండడం చూసి తటాల్న ఆగాడు. హాకీ కఱ్ఱ మణి కాళ్ళవద్ద పడివుంది.

ప్రతిరోజు ఆఫీసునుండి రాగానే భార్యను "మణి ఎక్కడ?" అని ప్రశ్నించేవాడు. "వాడు ఆడుకుందికి పోయాడు," ఆమె జవాబిచ్చేది. "ఈరోజున ఆడుకుందికి పోకుండా ఎందుచేత అక్కడలానిలబడ్డాడు? అనారోగ్యంగా ఉన్నాడా? స్నేహితులతో ఏమైన జగడమాడాడా?" ఆలోచిస్తూ మణి వేపు నడచేడు. ఆటవైపే నిదానంగా చూస్తోన్న మణి తండ్రిరాక గ్రహించలేదు.

సీతారామయ్య కొడుకువీపుమీద చేతితో తట్టుతూ అడిగాడు "ఏం ఆలోచిస్తున్నావు మణీ?" మణి తండ్రివైపు చూడాలేదు — మాట్లాడనూలేదు — తలమాత్రం అడ్డంగా వూపాడు. "అయితే ఆడుకుందికి ఎందుకు పోలేదు?"

"అమ్మ పోవద్దన్నది" మణి బొంగురు పోయిన గొంతుతో అన్నాడు.

"ఎందుకని?"

"అక్కడకు ఆడుకుందుకు వచ్చే కాశిం కొడుకులుగాని, ఇతర ముస్లిం యువకులుగాని నన్ను చంపేస్తారేమోనని."

"బుద్ధిహీనత, విను — అట్లాంటిభయాలు నీతలలో పెట్టుకోకు". సీతారామయ్య దృఢ స్వరంతో అన్నాడు.

"నేనేం భయపడలేదు నాన్నా" మణి మెల్లగా తిరుగుతూ అన్నాడు "అబ్దులు, ఖాదరు నా ప్రాణస్నేహితులు, వాళ్లు నా కెప్పుడూ హానిచెయ్యరు, కాని ఎంత చెప్పినా అమ్మ నమ్మకుండా ఉంది."

"కావచ్చు—నువ్వన్నది నిజం — నీకు వాళ్లెప్పుడూ హానిచెయ్యరు. మీ అమ్మ పిరికితనం యీరోజు కొత్తకాదు. ఎప్పుడూ వున్నదే, నువ్వాడుకుందికి పో."

"పోదునా!" మణి సంతోషంగా ఎగిరాడు. సీతారామయ్య వాని భుజముమీద తట్టి తలవూపాడు. మణి తన హాకీకఱ్ఱ తీసుకుపోబోతూంటే తండ్రి వెనక్కు పిలచి అన్నాడు.

"మీఅమ్మ నీతో అన్నమాటలు నీస్నేహితులతో అనకు."

"లేదు, నాన్నా."

* * *

సీతారామయ్య కిటికీవద్ద నిలబడి పిల్లల ఆట కిటికీగుండా చూస్తున్నాడు. మణి ఆటలో కలియడం చూశాడు. అబ్దులు, ఖాదరు కూడ మణికి స్వాగతం యిచ్చారు. మణిని ఆటలో చేర్చుకునేందుకు ఒక్క నిముషం ఆట ఆగి తిరిగి ప్రారంభం అయింది. సీతారామయ్య 'కాఫీ' మాటే మరచిపోయి ఆటవేపే చూస్తున్నాడు. అతని భార్య సుభద్ర రావటం కూడ ఆమె మాట్లాడేవరకు గ్రహించనేలేదు.

"మీరు కాఫీ త్రాగరా?"

"బహుశా! త్రాగుతాను," అంటూ ఆమెతో వంటింట్లోకి నడిచేడు "పిల్లలఆట చూస్తూ కాఫీమాటే మరచిపోయ్యాను. మన మణికి వాడిస్నేహితులు ఎట్లాంటి స్వాగతం యిచ్చారో చూశావా?"

ఆఖరుమాట వినగనే సుభద్ర గభాల్న నిలబడిపోయింది. ఆమెలో ఒకవిధమైన భయ కోపాలు చెలరేగినయి — "మణి — మణి అక్కడున్నాడా?" ఆటస్థలంవైపు చూపిస్తూ అడిగింది — "వాడిని అక్కడకు పోవద్దని నేను చెప్పాను."

"అవును, నాతో చెప్పాడు, అది వాడి తప్పుకాదు. నేనే వెళ్లమన్నాను. నీతో చెప్పకుండా పంపినందుకు నేనే నిన్ను క్షమార్పణ కోరుకోవాలి, కాని వాడిని ఆడుకుందుకు ఎందుకు పోవద్దన్నావు?"

"ఎందుకా? మీరు పేపరు చదవలేదా?" ఆమె కొంచం తీవ్రంగా అన్నది.

సీతారామయ్య నెమ్మదిగానే అన్నాడు "ఆఁ — చదివాను — కాని అంత శ్రద్ధగా కాదు, ఏం? ఏంవయిన విశేషాలున్నయ్యా?"

సుభద్ర జవాబివ్వకుండా టేబిలువద్దకు వెళ్లి పేపరు తీసుకుని సీతారామయ్య ఎదు



రుగా ఉంచి "చదవండి, ముస్లింల సంఖ్య ఎక్కువగా ఉన్న ప్రదేశాలలో ఏం జరుగుతూందో—ముస్లిమేతరులు సర్వనాశనం అవుతున్నారు."

పేపరు తనచేతిలోకి తీసుకుంటూ "ఆ సంగతులు నేను విన్నాను, అయినా అవి మనకెల్లా అన్వయిస్తాయి? అటువంటి స్థలాలికి మనం కొన్ని వందల మైళ్ళ దూరంలో వున్నాం?"

ఆమె కోపంతో వణకిపోతున్న స్వరంతో అన్నది "మీకు చెప్పటం కష్టం, మీరర్థం చేసుకోరు — భవిష్యత్తు ఆలోచించరు — ఇంత పెద్ద ఉద్యోగం మీ కెవరిచ్చారో నా కర్థం కాలేదు.?"

"ఓహో! అందువిషయమై నువ్వాశ్చర్యం గాని ఆందోళనగాని పడనవసరం లేదు." నవ్వుతూ సీతారామయ్య చెప్పాడు. "ఏం వయినా ఆయన నాకీ ఉద్యోగం యివ్వటమే మంచిదయింది. ఆయనను నువ్వెప్పుడూ అభినందించాలే గాని నిందించకూడదు. నాకీ ఉద్యోగమేకాకుంటే నీ నగలు, చీరలు, అధికారాలు మొదలయిన నీ కలలన్నీ నిజమయి ఉండేవేనా? పోనీగాని మణిని ఆడుకుందికి గ్రందుకు పోనిచ్చావుకావో చెప్పావుకావు?"

సుభద్ర ఆందోళనలో పడింది. భర్త అభిప్రాయాలు తనకు పూర్తిగ తెలుసును. ఆమె అతనిని ఎదిరిస్తున్నదేమో నని భయపడింది. ఆమె లోనికివెళ్తూ మెల్లిగా అంది "కాశిం కొడుకులు యింకా యితర ముస్లిం యువకులు అక్కడకు ఆడుకుందుకు వస్తారన్న సంగతి మీకు తెలియదా? వాళ్లుగాని మణిని చంపేస్తారేమో?"

"శుద్ధ తెలివితక్కువ" అతను కఠినంగా అన్నాడు. కాని వెంటనే గొంతు మార్చుకొని "నీకీ మూర్ఖపాలోచనలు ఎందుకు కలుగుతయి సుభా? అక్కడ యితర హిందూ యువకులు మాత్రం ఆడటంలేదా?"

"ఆడుతున్నారు బహుశా వాళ్ల తలిదండ్రులు ఆపద గ్రహించి ఉండరు. నేను వాళ్ళను హెచ్చరించాలి."

"అటువంటిదేమీ నువ్వు చెయ్యబోకు." అతడు సూటిగా అన్నాడు "కాశిం గాని, కాశిం కుమార్లుగాని లేకుంటే ఇతర ముస్లింలు ఎవరయినాగాని అల్లరులు లేవదీసే సూచనలేవయిన చేసారా, ముఖ్యంగా మణిని చంపాలని లేకుంటే ఏదైన హాని చేద్దామనిగాని?"

"అంత తెలివి తక్కువ ఉంటుందండీ? వాళ్ళుచేసే దుర్మార్గంపనులు చెప్పిచేస్తారా? అయినా ఎవరి క్షేమం వాళ్లు చూసుకోవాలి, మన క్షేమం మనం చూసుకోవాలి."

"అయితే మణి రేపు స్కూలుకుపోవటం ఎట్లా? కేవలం వాడిని ఇల్లే కదలనియ్యవా?"

"అలా ఎందుకు చేస్తాను? వాడి వెంట నౌకర్లను పంపిస్తాను. నాకు నేను ఎక్కడికైనా వెళ్ళాల్సివస్తే కారులేందీ గుమ్మం వేదిగను."

సీతారామయ్య గట్టిగా నవ్వ నారంభించాడు. "అయితే వాళ్ళపట్టుదలకు నీ యీ రక్షణ సరిపోతుందంటావా? ఈ మూర్ఖపాలోచనలన్నీ నీ తలకాయలో ఎలా దూరుతున్నాయో నాకాశ్చర్యంగావుంది. లేకుంటే యిది నీ 'గుండెజబ్బా'?"

ఈ మాటలు వినగనే సుభద్ర తలక్రిందులైంది. ఆమె కిటికీవేపు నడుస్తూ అంది "మీ కెప్పుడూ నన్ను వెక్కిరిస్తూంటేనే ఆనందం కలుగుతుంది. ఎప్పుడో గుండె జబ్బం టే యిప్పుడూ అదే అంటారు."

"అబ్బే, అదికాదు, నీ విజ్ఞానాన్ని నేను మెచ్చుకుంటాను. కొంచెమో గొప్పో అన్ని సంగతులు తెలిసినదానివి నీకీ విపరీతాలోచనలు ఎందుకు కలుగుతూంటాయా అని?"

"ఎందుకంటే నాబిడ్డను నేను ప్రేమిస్తాను కాబట్టి వాడిక్షేమం నేను చూడాలి" కండ్లనీరుతుడుచుకుంటూ అంది "ఈరోజుల్లో మతకలహాలు, అంతఃకలహాలు విద్యుచ్ఛక్తికంటె ఎక్కువగా వ్యాపిస్తున్నయి. ఏదో ఒకరోజున కాశిం కుటుంబం, ఇతర ముస్లింలు ఆ కలహాల్లో చేరవచ్చు."

"కావచ్చు, కాని, ఇక్కడలా జరుగుతుందంటే నేను నమ్మలేకుండా వున్నాను. ఎంచాతంటే యీ పట్టణంలోగాని, చుట్టుప్రక్కలగాని ఎవరి సంఖ్య ఎక్కువగా ఉంది హిందువులది కాదా?"

"అవును"

"అయితే కాశింగాని, ఇతర ముస్లింలుగాని అల్లరులు లేవదీస్తారని నువ్వెలా అను

కుంటున్నావు? అలాగే అయినట్లయితే నాశనమయ్యేవాళ్లు ముస్లింలు కాని నువ్వు కాదు. విను సుభా! కాశిం కుటుంబమో లేక ఇతర ముస్లింలో హిందువులను చంపేస్తారేమోనని నువ్వు భయపడుతున్నావు. అది కేవలం నీ మనోదౌర్బల్యం. ఆ ఆటస్థలం వేపు చూడు—అన్నిమతాలవాళ్లు—జాతులవాళ్ళు—ఆ పిల్లలు ఎంత ఉత్సాహంగా ఆడుకుంటున్నారో! మణినికూడ నీ దురభిప్రాయాలలోకి యీడుద్దామని చూస్తున్నావు.

ఇంతతో వూరుకోక నీ యీ మూఢభయాల్ని యిరుగు పొరుగువాళ్లకుకూడ కలగజెయ్య చూస్తున్నావు. అందువల్ల ఏమవుతుందో ఆలోచించావా? నువ్వు, నీ కల్పితభయాలే అల్లరులకు మూలకారణం అవుతాయి. ప్రతి హిందువుకూడ మహమ్మదీయు డవుపించే సరికే అనుమానదృష్టితో చూడనారంభిస్తాడు. హిందువులను చూసేసరికి ముస్లిములుకూడ అలానే చేస్తారు. ఒకళ్లనుచూసి ఒకళ్లుభయపడడం సాగిస్తారు. కాని ఎంతకాలం యిలా గడుస్తుంది. ఎంతోకాలంకాదు. ఎంచేతంటే అనుమానం పట్టుకున్న మనస్సులకు శాంతి వుండదు. ఇక్కడ మనహిందువుల సంఖ్యే ఎక్కువకాబట్టి ముందుగా వాళ్లేలేస్తారు. యీ భయం పోగొట్టుకొనేందుకు ప్రతీకారం ముస్లింలను నాశనంచేయటమే అంటారు' వెంటనే అవుపించిన ముస్లింనల్లా నరక నారంభిస్తారు. వార్తా పత్రికలకు యీ వార్తలు గోరంతలు కొండంతలుగా చేర్తాయి. పత్రికలవాళ్ళు తాటికాయంతేసి అక్షరాల్తో ఆ వార్తలు అచ్చేసి దేశంమీదికి వదుల్తారు. యీ విపరీతంతో యిప్పటివరకు శాంతి అనుభవిస్తూన్న యీ పట్టణమేకాకుండా యీ పరిసరప్రాంతాలుకూడ మతకలహాల కారణంగా సర్వనాశనం అవుతేయి.

“ముస్లింలను చంపమని, మతద్వేషాలు పెంచుకోమని నేను చెప్పటంలేదు. మన జాగ్రతలో వుండాలని, మనబోటి' వాళ్లను కూడ జాగ్రతతో వుండమని హెచ్చరించాలి అని నేనంటున్నాను.”

“నిజంలే, కాని దాని పరిణామం ఏమవుతుందో నువ్వాలోచించలేదు. మనకు సంబంధించిన యితర విషయాలుకూడా మనమాలోచించాలి. మన మణిని అభివృద్ధిలోకితెచ్చే విషయంలో మనం ఏం నిశ్చయించుకున్నామో నీకు జ్ఞాపకముందా? వాడు తన ఆత్మగౌరవాన్ని నిలబెట్టుకుంటూ మనోధైర్యంతో ఎవరికీగాని ఎందుకూగాని భయపడకుండా ఉండేటట్టు చెయ్యాలని. చివరకు మనకుకూడా. వాడు కేవలం భగవంతునకే భయపడాలి. ఇదంతా మరచిపోయావా?”

“అవును, నేను భగవద్గీత అర్థంచేసుకున్నంతవరకు, కాని ప్రస్తుతానికి దానికి సంబంధమేమిటి?”

“ఓ, కావలసినంత.” సీతారామయ్య చుట్టముట్టించి “మణి మెదడు యిప్పుడు యిప్పుడు కరగి ద్రవరూపంలోనే ఉంది. యిప్పట్లో యింకేదయినవేసి కరగించాలంటే కరగించవచ్చు. కాని గట్టిపడిపోయిందంటే మనం ఏంచెయ్యలేం. వాడేదయిన దురభిప్రాయంలోపడితే మనం వాడికి బోధపరచి వాడి దురభిప్రాయాలు మార్చుకొనేటట్టు చూడాలి. నువ్వు వాడికి అనవసర భయం నేర్పి ఆడుకుందుకు పోనివ్వకుండా ఆటంకం పెట్టి ప్రతీవిషయానికి భయపడేటట్టు బలవంతంచేస్తున్నావు వాడిని నువ్వు పిరికివాడినిగాను, నీచపుబుద్ధులు నేర్పి పాడుచేస్తున్నావు”

“ఎంతమాత్రము నిజంకాదు, వాడికి నేనెప్పుడు అలానేర్పలేదు. మీరు నామీద నిష్కారణంగా నిందలువేస్తున్నారు.”

“లేదు సుభా లేదు, నిందలు వెయ్యటంలేదు. నీ యీ కల్పిత భయాలవల్ల మణి జీవితరేఖ ఏవిధంగా పరిణమిస్తుందో నీకు తెలియజెప్తున్నావు. నీ యీ కల్పిత భయాలికి వాడు మూఢంగా లోబడుతే ఏమవుతుందో ఆలోచించావా? వాడు తప్పక ప్రతి మహమ్మదీయుడికి భయపడుతూ క్రమంగా వాళ్ళను అసహ్యించుకుంటాడు. దీనిని నువ్వు తర్కం అను వేదాంతంఅను. సహజంగా మనం దేనికి భయపడతామో దానిని ఏవగించుకుంటాం. అది మానవనైజం. వాడికికూడ కావలసినంత మంది స్నేహితులున్నారు. వాడు వాళ్లందరికీ యీవిషబీజాలే నాటుతాడు. తొందరగానో ఆలస్యంగానో ముస్లింలను ఏవగించుకునే ముఠా ఒకటి బయలుదేరుతుంది. అది క్రమేపి అభివృద్ధయి క్రమంగా జ్వాలలకుమల్లే దేశమంతా వ్యాపించితీరుతుంది.”

“ముస్లింలు మాత్రం మనహిందువులను ఏవగించుకోలేదా?” సుభద్ర అదోమోస్తరుగా అడిగింది.

“అంత మందీలేదు, మనవంటి తప్పు అభిప్రాయాలు తీసుకున్నవాళ్ళు మాత్రమే. అయినా నిజానిజాలు తెల్సుకున్న నాయకులెవరైన తెలియచేస్తే వాళ్ళు వాళ్ల తప్పభిప్రాయాలను మార్చుకోవచ్చు. కాని వాళ్ల అడుగుజాడల్లో మనమెందుకు నడవాలి. వారైనా, మనమైనా యీ దురభిప్రాయాలే మార్చుకోలేకపోతే యిక్కడనేకాదు దేశానికే శాంతిగాని రక్షణగాని దొరకదు. మహాత్ముడు మనకందజేసినశాంతి, అహింసల సందేశాల్ని అనుసరించడం మానేయడం కాకుండా, మణివంటి కుర్రాళ్లకు భయ అసహ్యాలు నేర్పటం అదినిజంగా భగవంతుడుకూడ క్షమింపలేనట్టి నేరం.”

“మీరెప్పుడూ యిలాగే అంటారు,” సుభద్ర కూర్చుని చెప్పసాగింది “మణిక్షేమం చూడటం నా విధి. వాడిని పిరికివాడినిగా చెయ్యాలని, తప్పుత్రోవలో నడిపించాలని నావుద్దేశ్యంకాదు.”

“తప్పకుండా నువ్వాపని చేస్తున్నావు. నీ యీ వెఱ్ఱిమొఱ్ఱి భయాలతో వాడి జీవితమే పాడుచేస్తున్నావు.”

సీతారామయ్య చుట్ట ముట్టించుకునేందుకు ఒక్కనిముషంఆగి మళ్లీ ఏదో చెప్పబోయేడు కాని సుభద్ర అక్కడలేదు. అతడులేచి కిటికీ వద్దకువెళ్లి నిలబడ్డాడు పిల్లలందరూ సంతోషంగా ఆడుకుంటున్నారు.

“హిందూదేశంలోని అన్ని జాతులవాళ్ళు, మతాలవాళ్ళు యిక్కడ వున్నారు. వీళ్లలో వీళ్లకు భేదంగానీ విపరీతంగాని ఏమీలేదు.

భారతమాతా! వీళ్లలోనయినా జాతి మత ద్వేషాలనే విషబీజాలు మొలకలెత్తకుండా చెయ్యి. మా తరువాతి సంతతి వారినైనా సోదరప్రేమతో కలసిమెలసి ఉండేటట్లు చెయ్యి.” అనుకుంటున్నాడు.

“నేను వీధిలోకి వెళ్తున్నాను.” ఆకస్మాత్తుగా సుభద్రమాటలువిని ఆమెవేపు తిరిగి “ఎక్కడికి” అతనడిగేడు.

“నేను శాస్త్రిలుగారిని కలుసుకోవాలి.”

“నువ్వొక్కర్తవు వెళ్లలేవు.”

“ఎందుకు వెళ్లలేను” ఆమెగొంతుక పెద్దదిచేస్తూ అంది.

“కాశింగాని, ఇంకెవరైన ముస్లింలుగాని నిన్ను చంపేస్తారేమో?” మరొకచుట్టముట్టిస్తూ అతనన్నాడు.

“ఎవరూ చంపరు, నేను మనకారులో వెళ్తున్నాను.”

“అయినా అది నీకు తగిన రక్షణకాదు. నేను నీవెంట నాతుపాకీ తీసుకుని వస్తాను.”

“వద్దు, వద్దు. మీరుగాని, మీతుపాకీగాని నాకక్కరలేదు.” ఆమెమరి కొంచెం తీవ్రంగా అన్నది. “నన్నెవరూ చంపలేరు.”

“వాళ్లు నిన్ను చెరపవచ్చు, నేను పెళ్లాంలేనివాడినిగాను, నా కొడుకు తల్లిలేనివాడుగాను అయిపోతాం. నీ వెంటనన్ను నా తుపాకీతో సహా రానిస్తే నువ్వు బయటికి కదలటం.”

“మంచిది- నేనువెళ్ళను.” ఆమె కుర్చీలో కూలబడింది. సీతారామయ్య ఆమెప్రక్కకు మరివొక కుర్చీ యీడ్చుకుని కూర్చుంటూ “రక్షించావు, ఆఫీసులోచచ్చిచచ్చి ఒక్కడిని విసుగ్గా కూర్చోగలనా? మరివొక కప్పుకాఫీ యివ్వగలవా? ఒకగడియ చదరంగం ఆడుకుందాం!

*   *   *

రోజులు దొర్లిపోతున్నయి. మణి, తనతల్లి దురభిప్రాయాలలో పడిపోకుండా సీతారామయ్య తనశక్తి వినియోగించి జయించాడు. కాని సుభద్ర తన యిరుగుపొరుగు వాండ్లకు తన దురభిప్రాయాలు వ్యాపింప చెయ్యకుండా చేయలేకపోయాడు, అవి అలా అలా ఆకులు, చిగుర్లు, పువ్వులు కాయలా ధరించి అతివేగంగా వ్యాపిస్తున్నయి. పత్రికలలోని వార్తలు యీ వార్తలు ప్రజలలో అలజడి కలిగింపనారంభించినయి.

అయినప్పటికీ పిల్లలందరూ కలసి కులాసగనే వాళ్లనిష్కలుషిత హృదయాల్లో యిప్పటివరకూ ఏ మాలిన్యమూ అంటలేదు. కాని ఏదోరోజు పెద్దవాళ్లవల్ల దీనికి ఘాతం రాకపోదని సీతారామయ్య భయపడుతున్నాడు.

ఈ పరిస్థితుల్లో మతకలహాల కారణంగా పారిపోయివచ్చిన కాందిశీకులు అసలే అశాంతిగావున్న ప్రజలకు మరింత భయోత్పాతాన్ని కలుగజేసే వార్తలు వ్యాపింపచేయ సాగారు. ఈ సమయంలోనే ఎట్టి ప్రళయం రాకముందే ప్రియబాపుజీ ఆయన నిరాహారదీక్షామూలంగా కొంతశాంతి నెలకొల్పారు. సుభద్ర యీ పరిస్థితుల్లో కొంచెం మార్పుచెందింది. సీతారామయ్య ఆనందానికి అంతులేదు.

అయితే ఆ కొంచెం రోజుల్లోనే ఘోర విషాదవార్తలు కారుమేఘాల్లోగా ప్రపంచమంతా వ్యాపించిపోయినయి. పిడుగువంటి ప్రియబాపుజీ నిర్యాణవార్త ప్రపంచమంతా ఆ బాలగోపాలాన్ని శోకవిహ్వలుల్ని చేసివేసింది. మహాత్ముణ్ణి రాక్షస హృదయాలు తమపొట్టను పెట్టుకున్నయి. దేశమంతా గాఢాంధకారంలో మునిగిపోయి దారీ తెన్నూ కానకుండా అయిపోయింది.

ఈ సమయంలో మతవిద్వేషాలు ఎల్లానో చల్లారాయి అనుకోబోయేసరికి వాటిస్థానంలో కొత్తవి మొలకలెత్తాయి. అవే కులద్వేషాలు. బ్రాహ్మణ బ్రాహ్మణేతర కలహాలు విజృంభించాయి.

ఆరోజు సీతారామయ్య ఆఫీసునుండి వచ్చేసరికి మణి కిటికీవద్ద నిలబడి ఆట స్థలం వైపు చూస్తున్నాడు. సీతారామయ్యకు ఈ సంగతి వింతగా తోచలేదు. ఎంచాతంటే కులద్వేషాలు కారణంగా ఏడెనిమిది రోజులయి అక్కడెవ్వరూ ఆడటంలేదు. కాని సీతారామయ్య కిటికీవద్దకు వెళ్ళిచూసేసరికి ఈరోజు మళ్ళీ పిల్లలందరూచేరి ఆడుకోవటం చూశాడు. “అయితే మరి మణి ఎందుకని ఆటకు పోలేదు?” తనలో తాననుకున్నాడు. “ఇంతలో హఠాత్తుగా హాకీ కఱ్ఱ క్రిందపడి వుండటం చూశాడు.

“ఈరోజు మళ్ళి మణి ఆటకు పోకుండా తల్లిచేత నిర్బంధించపడ్డాడన్నమాట! కాని ఎందుకు?” తనలోతాను ప్రశ్నించుకున్నాడు.

వంటయింట్లోకి వెళ్ళి సుభద్ర నడిగేడు “మణి ఎందుకని ఆడుకుందుకు పోలేదు?”

“నేను వాడిని పోవద్దన్నాను” ఆమె స్పష్టంగా చెప్పింది.

“ఆమాటే నే నడుగుతున్నాను, ఎందుకని?”

“ఎందుకని! వాడికి నేను తల్లిని కాబట్టి, వాడి క్షేమం విషయంలో దేనికైనా ఆటంకపెట్టే హక్కు నాకూ వుంది.” ఆమె ఇంకా స్వరం హెచ్చిస్తూ “వాడి బాగోగులు నాకూ తెలుసును.”

“నేను ఒప్పుకుంటాను.” సీతారామయ్య దృఢస్వరంతో చెప్ప నారంభించాడు “నీకు వాడిమీద హక్కులేదని, వాడి మంచిచెడ్డలు నీకు తెలియవని నేను నీతో తగువుపెట్టుకోలేదు—వాడిని ఆటకు ఎందుకు పోవద్దన్నావో కారణం చెప్పమంటున్నాను.”

“బ్రాహ్మణేతరులు ఏం చేస్తున్నారో మీరు వినడంలేదా?”

“ఆహా! అదంతా నాకుతెలుసును. వుత్త తెలివిహీనత తప్ప యింకేంలేదు. మహాత్ముని అభిప్రాయాలకు యిది కేవలం వ్యతిరేకం, వీళ్ళ యీ వుద్రేకం చావక తీరదు.”

“లేదు, శాస్త్రిలుగారి భార్య నాతో చెప్పింది. మహాత్ముణ్ణి చంపివేసినందుకు ప్రతీకారంగా యీ పట్టణంలో అధమం వెయ్యిమంది బ్రాహ్మణపిల్లల్నయినా చంపాలని బ్రాహ్మణేతరులు తీర్మానించుకొన్నారట.” ఆమె భయకంపితస్వరంతో అంది.

"ఏం మూర్ఖత్వం" సీతారామయ్య కఠినంగా అన్నాడు. కాని వెంటనే తనను తాను సంబాళించుకుని నెమ్మదిగా, "ఏమైనాసరే, దేశసౌభాగ్యంకోసం మణి వాడి ప్రాణాల్నయినా సరే త్యాగం చెయ్యగలందులకు మనం మనఃస్ఫూర్తిగా కోరాలి."

సుభద్రముఖంలో ఒక్క మెరుపు మెరసింది. ఆమెకండ్లు పెద్దవిగాచేసి సంతోషంగా ఏదో చెప్పబోతూండగా సీతారామయ్య—

"ఈ మధ్య అటువేపు నిర్మానుష్యమైన క్రొత్త ప్రదేశం కనిపెట్టారని పేపర్లోవేశారు. అది నేను కత్తిరించి వుంచాను. అది ఎక్కడ పెట్టానో నీకేమయిన జ్ఞాపకముందా?"

"ఆఁ—ఆ ఫైలులో వుంది."

"ఆ ఫైలు యిట్లా ఒకసారి తెస్తావా?"

"ఇప్పుడెందుకది?"

"అక్కడ మనకు కొంచం స్థలం దొరుకుతుందేమో ప్రయత్నిద్దామని!"

"అక్కడ! — ఆ అడివిలోనా! — ఎందుకు?"

"అలా ఐతే అక్కడే మనంఉందామని."

"మీకు పిచ్చి గిచ్చి పట్టలేదుగద?"

"లేదులేదు, యిప్పటివరకు భగవంతుడి దయవల్ల నాకు మతిభ్రమ కలగలేదు. నేను నా స్వాధీనంలోనే ఉన్నాను. నిజం చెప్తున్నాను."

"అక్కడ మీరేంచేస్తారు?" ఆమె ఆశ్చర్యంగా చూస్తూ అడిగింది.

"వ్యవసాయం, వేట, అక్కడ మనకు చాలా సంతృప్తికరంగా వుంటుంది." అతడు చిన్న అల్లరిగొంతుతో చెప్ప నారంభించాడు.

"మనం అక్కడ ఎవరికీ భయపడ అక్కర్లేదు. మత ద్వేషాలకుగాని కులద్వేషాలకుగాని వేటికీ భయంఉండదు—ఎవ్వరితోను మనకు ప్రమేయం ఉండదు-కావాలంటే మన మణి పెరిగిపెద్దవాడవుతే వాడికిష్టమవుతే యిక్కడ కొస్తాడు."

"కాని అక్కడ ఎవరూఉండరు–సినిమాలుండవు–దుకాణాలుండవు–ఆఖరుకు యిరుగు పొరుగు వాళ్ళైనా ఉండరు–నే నక్కడ వుండలేను బాబూ—నిజంగా మీకు పిచ్చే పట్టింది."

"లేదు సుభా, నాకు పిచ్చి గిచ్చి పట్టటంకాదు నీకు, నీపిచ్చ పోగట్టేందుకే యీ ప్రయత్నం. ఎప్పుడూ ఎందుకో ఒకందుకు భయపడుతునే ఉంటావు. నీ యీ కల్పిత భయాలుమానుకొని సంతోషంగా గడపాలంటే యిదొక్కటే మార్గం. ఇంక దుకాణాలు, సినిమాలు అంటావా? అందుకేం ఫరవాలేదు. ఒక సంవత్సరం వరకు మనకు కావలసిన అన్ని వస్తువులు ఒకేసారి కొనేసి నేనే అక్కడ ఒక దుకాణం తెరుస్తాను. ప్రతిరోజు నీకు కావలసిన వస్తువులు నావద్ద ఖరీదుచేసుకోవచ్చు. ఇంకా సినిమా ప్రొజక్టరు, కేమెరా మొదలయిన పరికరాలుకూడ పెట్టుకుంటాను. నేను తీసిన ఫిల్ములే నేను ప్రదర్శిస్తూంటే నా థియేటరును వొక్కర్తవే రిజర్వుచేసుకోవచ్చు–కావాలంటే మీ శాస్త్రిలుగార్నింకా అటువంటి వాళ్ళెవరయినా ఉంటే వాళ్లని పిలు. మనతో వస్తారేమో-ఏజాతి పక్షులు ఆజాతిని చేరుకుంటాయి అన్నట్లుగా మనకు వాళ్లకు సరిపోతుంది—

మధ్యలోనే సుభద్ర కేకపెట్టింది "మణీ" మణి గది గుమ్మంలోకి వచ్చాడు.

"నువ్వాడుకుందికి వెళ్ళు".

"వెళ్లనా!" తల్లివద్దకు ఒక్క గంతేసి ముద్దుపెట్టుకున్నాడు.

"భయంలేదమ్మా, ఆపిల్లలందరు నాకు స్నేహితులే, నన్నెవ్వరు హానిచేయరమ్మా." ఆ మరుక్షణంలోనే తన హాకీకఱ్ఱ తీసుకుని గదిలోనుండి పరుగెత్తాడు ఆటస్థలం వైపుకి.

జీవానందరసాయనము

ఊరపిచ్చుకల సత్తుతో ఫలరసములతో మలయాళ పద్ధతిలో తయారుచేయబడినది. స్త్రీ పురుషులకు గలుగు అన్ని వ్యాధులకు ఇది దివ్యౌషధము. రుచికరమైనది. పథ్యములేదు. సర్వకాలములందు యెల్లరు భుజింపదగినది.

జీవానందరసాయనమును పుచ్చుకొనిన జీవనరములలోచేరి వచ్చిన మేహ దుర్నీరు నశించును. స్త్రీ సంభోగముచే నేర్పడిన తెలుపు కాక, గ్రంధి, మేహవ్యాధి, మేహదురద, పిత్తపాండు, క్షయ, కాసలను పోగొట్టును దీనితోసాటి వేరొకటి లేదు. దురభ్యాసమువలన (హస్తప్రయోగాదులచే) గుహ్యావయము దుర్భలమై చిక్కిపోవును. వేడి, బలహీనము, ధాతునష్టము, స్వప్నస్ఖలితము, నరముల బలహీనత, ఆయాసము, దేహభీతి, ఆకలిలేకుండుట, మలబద్ధకం, గుల్మము, అజీర్ణం, నిద్రలేకుండుట, మేహకాక, రక్తముచెడుటచే గల్గు వ్యాధులు, మూలకాక, గుండెదడ, వెన్నునొప్పి, దగ్గు, ఇంద్రియము నీరై మూత్రములో పోవుట, స్త్రీలకడకుచేరినను తలచినను వెంటనే స్ఖలితమైపోవుట సంభోగచింత గలగనే తనకు తెలియకనే ఇంద్రియముపోవుట, కాలు చేతుల బలహీనత, జ్ఞాపకశూన్యము, దృష్టిమాంద్యము, మొదలైన లెక్కలేని వ్యాధులను పోగొట్టి, వీర్యవృద్ధి, ధాతుపుష్టి, రక్తవృద్ధి, భోగశక్తిని అపారముగ గల్గించును. శక్తివిహీనమై దుర్భలమైన గుహ్యోదయమునకు బలమునిచ్చి వృద్ధిచేసి రక్తకండరములను పెంపొందించును. సాటిలేని సంభోగానందమును గల్గించును. స్త్రీలకు గలుగు ఋతుదోషము, రక్తము అధికముగ స్రవించుట, సంతానాధిక్యమువలన దేహము కృశించుట, మర్మావయవము కృశించుట, బలహీనము, మర్మస్థానమున దురద, మంట, నొప్పి, వేడిచే తెలుపుకారుట, చర్మ సంబంధమైన మేహవ్యాధులు మొదలైన అనేక వ్యాధులను ఖండించి దేహమునకు, పుష్టి, బలము, కాంతిని కల్గించును. ½ పౌను టిన్ను 1-కి 2-12-0 తపాలాచార్జి 0-12-0

ధనలక్ష్మి అండు కో., సౌకారుపేట పోస్టు, మదరాసు.